విజ్ఞాన్స్ వర్సిటీ అధ్యాపకురాలికి పీహెచ్‌డీ

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ యూనివర్సిటీ లోని ఈసీఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫె సర్ అశ్విని వల్లూరికి తమ యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం పీహెచ్‌డీ పట్టా అందించిందని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'లో పవర్, ఏరియా ఎఫిసియంట్ అండ్ రిలియబల్ సీఎన్‌టీఎఫ్‌ఈటీ(కార్బన్ నానో ట్యూబ్ ఫీల్డ్ ఎఫెక్ట్ ట్రాన్సిస్టర్) బేస్డ్ ఎస్ఆర్ఏఎమ్(స్టాటిక్ రాండమ్ యాక్సిస్ మెమోరీ) డిజైన్ ఫర్ ఏ పేస్‌మేకర్ డివైస్' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారని తెలియ జేశారు. ఈమెకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈసీఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శారద గైడ్‌గా వ్యవహరించారన్నారు. ఈమె తన పరిశోధనలో మొత్తం 2 ఎస్‌సీఐ, 2 స్కూపస్ జర్నల్ పబ్లికేషన్, 4 కాన్ఫరెన్స్ పేపర్లు పబ్లిష్ చేశారని తెలిపారు. ఆమెను ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

3 వరకు జనసేన సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-పొన్నూరు : జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల మూడవ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా కార్యదర్శి తాళ్లూరి అప్పారావు ప్రకటనలో తెలిపారు. గత నెల 28వ తారీకు ఆఖరి తేదీ ప్రకటించిన విషయం విదితమే. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో సభ్యత్వ నమోదులో సాంకేతిక లోపం సమస్యలు తలెత్తిన కారణంగా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ నెల మూడో తేదీ వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు ఈ అవకాశాన్ని గమనించి ప్రజలకు సమస్యను వివరించి నూరు శాతం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆయన కోరారు.

'నవోదయ ఫ్యామిలీ రెస్టారెంట్' ప్రారంభం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మాగంటి శ్రీనివాస రావు, మేడసాని శశిబా బు సంయుక్తంగా స్థానిక బ్రాడీపేట 2వ లైనులో విశాల మైన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'నవోదయ ఫ్యామిలీ రెస్టారెంట్'ను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రెస్టారెంట్‌ను పరిశీలించి ఆరోగ్యకరమైన బిర్యానీ నగర ప్రజలకు అందజేయాలని సూచించారు. తయారీ విషయంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాల న్నారు. అనంతరం రెస్టారెంట్ ప్రొప్రైటర్స్ శ్రీనివాసరావు, శశిబాబు మీడియాతో మాట్లాడుతూ బిర్యానీ తయారీలో నిష్ణాతులైన వారిని హైదరాబాద్ నుంచి తెప్పించినట్లు చెప్పారు. పరిశుభ్రమైన ప్రాంగణంలో అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన బిర్యానీ నగర ప్రజలకు అందించటమే తమ లక్ష్యమన్నారు. ఆన్‌లైన్ సర్వీసులైన స్విగ్గీ, జొమాటోల ద్వారా కూడా అందజేయనున్నట్లు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి టీడీపీ నేత చిట్టాబత్తిన చిట్టిబాబు, కార్పొరేటర్ ఆచారి, బంధువులు, మిత్రులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నాయకుల అక్రమ అరెస్టులపై ఖండన

విశాలాంధ్ర-గుంటూరు : తూర్పుగోదావరి జిల్లా ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పి.సువర్ణ రాజు అక్రమ అరెస్టును ఖండిస్తున్నట్లు ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ ఓ ప్రకటనలో తెలిపారు. నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు కుమార్తె వివాహానికి ముఖ్యమంత్రి హాజరవుతున్నారనే నెపంతో ఉపాధ్యాయ సంఘ నాయకుడిని అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించడం హేయమైన చర్య అన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా సంఘ నాయకులు ఎక్కడ ఆందోళనలు చేస్తారో అని ప్రభుత్వం ఉలిక్కిపడి చేస్తున్న అక్రమ నిర్బంధాలు ఉపాధ్యాయుల ఆందోళనలను ఆపలేవన్నారు. వెంటనే సువర్ణరాజును విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత



విశాలాంధ్ర-దుగ్గిరాల: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం 30 తోపుడు బండ్లను ఎమ్మెల్యే ఆర్కే ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు అందజేశారు. వారు తోపుడు బండ్లు కొనలేని స్థితిలో ఉన్నారని ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి తోపుడుబండ్లను సొంత ఖర్చుతో అందజేశారు. ఈ సందర్భంగా ఆర్కే మాట్లాడుతూ సైకిల్, రిక్షాల మీద వ్యాపారం చేసు కునే కార్మికులకు వివిధ రకాల ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. చిరు వ్యాపారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పిటిసి మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, సర్పంచ్ బాణావట్ ఖుషి భాయ్, వైసీపీ నాయకులు దానబోయిన వెంకటేశ్వరరావు, దాసరి వీరయ్య, షేక్ సుభాని, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు సిటీ, గోరంట్ల, హెూసన్నా మందిరం ఎదురు, ప్లాటినం కౌంటి,బీస్ బ్లాక్,ఫ్లాట్ నెం:510 కాపురస్తులు **పార్వతం పెద్ద సుబ్బరామయ్య** గారి కుమారుడు **వెంకట సత్యనారాయణ** గారి సూచనల మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు, గుంటూరు డి.,పెదకాకాని (సబ్.డి. &గ్రామ) డి.నెం: 532 యు 2-30 సెంట్లు మింజుమలె చ.గ. 401లు స్థలము, అందలి డోర్ నెం:2-100, అసెస్ మెంట్ నెం: 287, గల ఆర్.సి.సి డాబా ఇల్లు వగైరాలు కు సంబంధించిన ఆస్తిని **విక్రయ దస్తావేజు నెం: 3691/2021 యస్.ఆర్.ఓ పెదకాకానిలో డి: 10-11-2021**న కొనుగోలు చేసి రిజిస్టరు పొందిన ఆస్తికి చెందిన **లింకు దస్తావేజు నెం 3906/1966** యస్.ఆర్.ఓ. పెదకాకాని వన్నాల వెంకట ఆదిశేషు గారి పేరుతో గల దస్తావేజు మరికొన్ని డాక్యుమెంట్లను కవరులో పెట్టుకొని **డి:27-02-2023** న జిరాక్స్ నిమిత్తం అరండల్ పేటకు ఆటోలో వెళ్ళుచుండగా సదరు డాక్యుమెంట్లు గల కవరు మార్గమధ్యంలో పోయినది. సదరు విషయమును జిరాక్స్ షాపు దగ్గర చూసుకొనగా కనిపించలేదు. కావున వచ్చిన దారిలో తిరిగి ఎంత వెతికినను దొరకలేదు. కావున ఎవరికైనా మా క్లయింటుకు సంబంధించిన పై తెలిపిన లింకు డాక్యుమెంట్ యొక్క ఒరిజినల్ దొరికిన యెడల నాకు గాని, నా క్లయింటుకు గాని తెచ్చి ఇచ్చిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును. అట్లు కాక సదరు డాక్యుమెంటును ఉపయోగించి ఏ విధమైన లావా దేవీలు, అన్యాక్రాంతములు చేసిన యెడల నా క్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

P.M.B.G.Tilak, Bcom, LL.B.,
Advocate, Nagaralu, Guntur.,
Cell No:90306 44945

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని మల్లయ్యలింగంభవన్ నుంచి భగత్ సింగ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా, నగర కార్యదర్శులు జంగాల అజయ్ కుమార్, కోట మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ధరల పెంపుదల నిర్ణయం అత్యంత హేయమైన చర్య అన్నారు. కమర్షియల్ సిలిండర్‌పై రూ.350.50, సాధారణ సిలిండర్‌పై రూ.50 పెద్ద మొత్తంలో పెంచడం ద్వారా ప్రజలపై తీవ్ర భారం పడుతున్నదని అన్నారు. తక్షణమే గ్యాస్ ధర పెంపుదల నిర్ణయం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ అధికారంలోకి రాకముందు రూ.500 ఉన్న సిలిండర్ ధర ప్రజలకు సబ్సిడీ రూపంలో సుమారుగా రూ.100 బ్యాంకు ఖాతాలో జమ అయ్యేవని అటువంటిది కరోనా కాలం నుంచి ప్రజలకు వస్తున్న సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసిందన్నారు. నేడు పెరిగిన రూ.50లతో సాధారణ సిలిండర్ ధర రూ.1150లకు పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలు చూస్తూ ఉంటే ప్రజలను మరల కట్టెల పొయ్యికి చేరువ చేసేలా ఉన్నాయని ఎద్దేవాచేశారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, చల్లా మరియదాసు, యశ్వంత్, నగర సమితి సభ్యులు వలి, నాసర్ జీ, జంగాల చైతన్య, రామచంద్రుడు, జగన్నాథం, జ్ఞానదీప్, చినపోతుల శ్రీనివాస్, శ్రీను, త్రినాథ్, జంగాల యేసు, కాయల రామారావు తదితరులు పాల్గొన్నారు.

అందరి క్షేమమే జగనన్న లక్ష్యం



విశాలాంధ్ర-ఫిరంగిపురం: కుల, మతాలకు అతీతంగా అందరి సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని తాడికొండ నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. అవ్వా తాతలు ఎవరిపై ఆధార పడకుండా అర్హులైన వారందరికి అందిస్తున్న వివిధ రకాల పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఫిరంగిపురం క్రీస్తునగర్ కాలనీలో సురేష్‌కుమార్ బుధవారం మండల వైకాపా నాయకులతో కలిసి పాల్గొన్నారు. జగనన్న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సచివాలయ వ్యవస్థ, రైతు బరోసా కేంద్రాలు, వాలంటీర్ వ్యవస్థలను ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాల్లో కూడ ప్రారంభించడానికి ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు సన్నాహాలు చేస్తున్నారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి గడపకు మంచి చేసి జగన్ ప్రజల మనస్సుల్లో నిలిచి పోయారని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిపి షేక్ షహెలా నర్గీస్, వైస్ ఎంపిపిలు విజయలక్ష్మి, గుమ్మడి చంద్రం, వైకాపా నాయకులు మార్పుల శివరామిరెడ్డి, గఫార్, అంజిరెడ్డి, చిన్నప్పరెడ్డి, ఎంపిటీసిలు సాలె సంధ్యారాణి, సీతారామిరెడ్డి, లక్ష్మయ్య, యల్లారెడ్డి, మరియబాబు, పెరికల చంటి, గృహ సారధులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

7 హిల్స్ ఫార్మసీ నూతన బ్రాంచ్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ : ప్రజా సేవే లక్ష్యంగా గత 30యేళ్లుగా మెడికల్ రంగంలో సేవలందిస్తున్న 7 హిల్స్ ఫార్మసీ నూతన బ్రాంచ్‌ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. విజయవాడ నక్కల్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 7 హిల్స్ ఫార్మాసిని మాజీ పార్లమెంటు సభ్యులు, లైలా గ్రూప్ సంస్థ ఛైర్మన్ గోకరాజు రంగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా రంగంలో ఏంతో అనుభవం కలిగి ఎవ్వరు ఇవ్వని డిస్కౌంట్‌ను ఇస్తునందుకు 7 హిల్స్ ఫార్మసీ అధినేత దేగల ప్రభాకర్‌ను అభినందించారు. నాణ్యతకు మారు పేరుగా 7 హిల్స్ అందిస్తున్న సేవలు రానున్న రోజుల్లో మరింతగా విస్తరించాలని ఆయాన ఆకాంక్షించారు. దేగల ప్రభాకర్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక డిస్కౌంట్ ఇస్తున్న ఏకైక ఫార్మసీ7 హిల్స్ ఫార్మసీ అన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రజా సేవ చేసేందుకే వ్యాపారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయవాడ నగరంలో ఉచిత డెలివరీ సదుపాయాన్ని కూడా అందుబాటులో ఉంచామని, విజయవాడలో నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 7 హిల్స్ ఫార్మసీ ని ఆదరిస్తున్నారు రెండు రాష్ట్రాల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

విశాలాంధ్ర-తాడికొండ : అడ్డరోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. తాడికొండ ఎస్సై వి.నరసింహా వివరాల ప్రకారం తెనాలి రూరల్ అంగలకుదురు గ్రామానికి చెందిన కసుకుర్తి జయరాజు (45) అనే ఉపాధ్యాయుడు రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లిలో పనిచేస్తున్నాడు. జయరాజు భార్య విజయశాంతి తుళ్లూరు మండలం ఉద్దండరాయనపాలెంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తుంది. పిల్లల చదువు నిమిత్తం తుళ్లూరులో నివాసం ఉంటున్నారు. రోజు మాదిరిగానే పాఠశాలకు బయలుదేరిన జయరాజు అడ్డరోడ్డు సమీపానికి రాగానే అమరావతి వైపు నుంచి వేగంగా వెళుతున్న బెంజి ఇసుక లారీ బలంగా ఢీ కొట్టింది. జయరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతిని అన్న బాలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. శవ పంచనామా నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కస్టమ్ డిజైన్ చిప్‌సెట్, 200 ఎంపీ కెమెరాతో శామ్‌సంగ్ గెలాక్సీ ఎస్23

గుంటూరు: శామ్‌సంగ్ ఫ్లాగ్‌షిప్ స్మార్ట్ ఫోన్ సీరీస్ అయిన గెలాక్సీ ఎస్23 సీరీస్ అమ్మకాలు 24 నుండి ప్రారంభమయ్యాయి. గెలాక్సీ ఎస్23 అల్ట్రా, గెలాక్సీ ఎస్23ప్లస్, గెలాక్సీ ఎస్23 ఉపకరణాలు అత్యుత్తమ శ్రేణి వినూత్న పరిజ్ఞానముతో ఈ తరానికి సంబంధించిన నవ్యతతో ఉన్నాయి. కొత్త గెలాక్సీ ఎస్23 సీరీస్ స్మార్ట్ ఫోన్లను కొనుగోలు చేయాలని చూస్తున్న కస్టమర్లు వాటిని శామ్‌సంగ్ వెబ్సైట్ ద్వారా గానీ, ఎంపిక చేయబడిన రిటెయిల్ ఔట్‌లెట్ల నుండి కొనుగోలు చేసుకోవచ్చు. ఐతిహాసిక సునిశితత్వంతో చిత్రాలను గ్రాహ్యత చేసుకోగల అడాప్టివ్ పిక్సెల్స్ తో సరికొత్త 200ఎంపీ సెన్సార్, కస్టమ్ డిజైన్ చేయబడిన స్నాప్‌డ్రాగన్ 8 జెన్2 మొబైల్ ప్లాట్‌ఫామ్ తో ఎస్23ని రూపొందించారు.

ఘనంగా స్వామి వారి కళ్యాణ మహోత్సవాలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక మారుతీనగర్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠం శ్రీ మారుతీ దేవాలయ 36వ వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా మహా కుంభాభిషేకం సహిత జీవ ధ్వజ పున: ప్రతిష్ట మహోత్సవాలలో 7వ రోజు ఉదయం గోపూజ జరిగింది. 8గంటలకు కుమారి పూజ, కోటి కుంకుమార్చనలు, 9గంటలకు విఘ్నరాజార్చన, పుణ్యాహవచనము, పంచగవ్యప్రాసనము, ప్రాతరౌపాసన, నిత్య పారాయణలు, హారతి కార్యక్రమాలు విశేషంగా జరిగాయి.

మహాధర్నా విజయవంతం చేయాలి: సీపీఐ

విశాలాంధ్ర-పెదకాకాని : సీపీఐ పిలుపుమేరకు జగనన్న గృహాలకు ఐదు లక్షలు ఇచ్చి, టిడ్కో ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ జరిగిన కార్యక్రమానికి కేతినేని అగస్టీన్ అధ్యక్షత వహించగా పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పేదలకు పంపిణీ చేసిన స్థలాలలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పేదలందరికీ 30 లక్షల ఇళ్ల స్థలాలకు పట్టాలు పంపిణీ చేస్తానని, మొదటి విడత 15 లక్షల గృహాలు రెండవ విడత 15 లక్షల గృహాలు ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇస్తానని గత ఎన్నికలలో ప్రజలకు వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి పూర్తిగా విస్మరించి నేడు జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఒక సెంటు భూమి ఇచ్చి రూ.1.80 లక్షలు మాత్రమే ఇచ్చి లబ్ధిదారులను గృహాలను వెంటనే నిర్మించుకోవాలని లేనిపక్షంలో స్థలాలు వెనక్కి తీసుకుంటామని అధికారులతో బెదిరించటాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు, ఒక్కొక్క లబ్ధిదారునికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించటం అభినందనీయమని రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు డబ్బులు లేక నిర్మాణాలు చేపట్టలేక నానా ఇబ్బందులు పడుతున్నారని ఆ ఇచ్చిన స్థలాల్లో భూమిలో పిల్లర్స్ వేసి కొంతమందిని పునాదులు వరకు కట్టి కొంతమంది నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాలలో పిచ్చి మొక్కలు గడ్డి మొక్కలు మొలిసి జగనన్న కాలనీలు అడవిని తలపిస్తూ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పొన్నూరు నియోజవర్గంలో జగనన్న కాలనీ స్థలాలు లబ్ధిదారులందరూ మార్చి 2న విజయవాడలో జరిగే మహాధర్నాను జగనన్న గృహాల లబ్ధిదారులు, టిడ్కో లబ్ధిదారులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెంటాల కుమారి, బుల్లా బాబురావు, బొట్టు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి మహాధర్నాకు తరలిరండి

విశాలాంధ్ర-గుంటూరు : టిడ్కో గృహాలను లబ్ధిదారులకు స్వాధీనపరచాలని, జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదిన విజయవాడలో తలపెట్టిన మహాధర్నాకు గుంటూరు నగరంలోని లబ్ధిదారులు పెద్దఎత్తున తరలివెళ్ళాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

సీపీఐ ఆధ్వర్యంలో నిరసన



విశాలాంధ్ర-పెదకాకాని : సీపీఐ ఆధ్వర్యంలో పెరిగిన వంట గ్యాస్ ధరలపై నిరసన కార్య క్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి పొన్నూరు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు కొల్లి రంగారెడ్డి అధ్యక్షత వహించారు. సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ 2014 ఎన్నికల ప్రచారానికి ముందు డీజిల్ రూ.46, పెట్రోలు రూ.54 వంట గ్యాస్ ధర రూ.410 ఉన్న ధరలు ఇప్పుడు అవికాస్త ఆకాశనంటాయని ధ్వజమెత్తారు. మేము అధికారంలోకి వస్తే వాటిని తగ్గిస్తామని దేశ ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమైయ్యాయని ప్రశ్నించారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే కేంద్ర ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బుల్లా బాబురావు, కేతినేని అగస్టీన్, కొండలు, శ్రీనివాసరావు, బుల్లా వీరయ్య, వెంకయ్య పాల్గొన్నారు.

పేదరికాన్ని తక్కువ చేసి చూపుతున్న పాలకులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారత పాలకులు ప్రపంచంలో తమ పరువు పోతుందనే ఉద్దేశ్యంతో పేదరికాన్ని తక్కువ చేసి చూపుతున్నారని ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ విమర్శించారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'భారతదేశంలో ఆర్థిక అసమానతల ఫలితమే పేదరికం'అనే అంశంపై చర్చా కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ భారతదేశంలో సుమారు 60కోట్ల మంది రోజుకు 3.65డాలర్ల కంటే తక్కువ సంపాదనతో జీవిస్తున్నారని ఐక్యరాజ్య సమితి పేర్కొన్నట్లు చెప్పారు. విద్యావేత్త టి.నారపరెడ్డి మాట్లాడుతూ పేదరికం అన్నది ఆర్థిక అసమానతల ఫలితంగా ఏర్పడిందని, కనీస అవసరాలైన తిండి, గూడు, బట్టలు వైద్యం, విద్య పేదరికంను దూరం చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలు పేదరికాన్ని నిర్మూలించలేకపోయయని ఆవేదన వ్యక్తంచేశారు. విశ్లేషకులు రవిబాబు కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, చంద్రయ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

అద్వితీయ 2కె-23 విజయవంతం



విశాలాంధ్ర-తాడేపల్లి: కేఎల్ విశ్వవిద్యాలయంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వ ర్యంలో అద్వితీయ 2కె-23 విజయవంతంగా ముగిసింది. ఇందులో భాగంగా నాన్ టెక్నికల్ విభాగంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రకటించారు. పెన్ మాన్ విభాగంలో డేవిడ్ రాజ ప్రథమ బహుమతి(ఐఐఐటి నూజివీడు), ప్రణీత్ ద్వితీయ బహుమతి (ఐఐఐటి నూజివీడు), గణేష్ తృతీయ బహుమతి(వి ఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజ్), మిస్టర్ అద్వితీయ విభాగంలో శివాజి (ఐఐఐటి నూజివీడు), మిస్ అద్వితీయ విభాగంలో స్నేహ తప (కేఎల్ యూనివర్సిటి), ట్రెజర్ హంట్ విభాగంలో సాయి శిరీష టీం ప్రథమ బహుమతి(ఐఐఐటి నూజివీడు), ఆది లక్ష్మి టీం ద్వితీయ బహుమతి(ఐఐఐటి నూజివీడు), నవీన్ టీం తృతీయ బహుమతి(ఐఐఐటి నూజివీడు) మరియు క్రికెట్ విభాగంలో అద్వితీయ ఛాంపియన్ షిప్ ట్రోఫిని కేఎల్ యూనివర్సిటికి చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కైవసం చేసుకున్నారు ఈ బహుమ తులను కన్వీనరు డాక్టర్ ఏవీ రావు, సివిల్ విభాగాధిపతి హేమంతరాజ సంయుక్తంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ పోలురాజు, అధ్యాపకులు, విద్యార్థులు, వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'జాతీయ సైన్స్' దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : 'జాతీయ సైన్స్' దినోత్సవం సందర్భంగా గత మూడు రోజులుగా స్థానిక బ్రిపాలెం రోడ్డు లోని శ్రీచైతన్య పాఠశాల నందు విద్యార్థినీ, విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలతో తయారు చేసిన అనేక నమూనాలతో ప్రదర్శనలు చేశారు. ప్రిన్సిపల్ లక్ష్మీపతి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ఐ జి.అప్పాజీ ముఖ్య అతిథిగా పాల్గొని 1928 ఫిబ్రవరి 28న 'రామన్ ఎఫెక్ట్'అంటే పారదర్శకంగా ఉన్న గన, ద్రవ, వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింపజేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చుకుంటుందన్న దృగ్విషయాన్ని సీవీ రామన్ నిరూపించినట్లు చెప్పారు. దీంతో ఆయనకు గుర్తుగా ఫిబ్రవరి 28రోజును జాతీయ సైన్సు దినోత్సవం జరుపుకుటుంన్నామన్నారు. శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సునీల్ విశిష్ట అతిథిగా పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పర్యవేక్షించి ఉత్తమ నమూనాలను ఎంపిక చేసిన విద్యార్థులను బహుమతులతో అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ ఇన్‌ఛార్జ్ రమాదేవి, అకడమిక్ డీన్ ప్రవీణ్, అకడమిక్ కో-ఆర్డినేటర్ పి.గోపీచంద్ తదితరులు ఉన్నారు.

నిరుపేద గిరిజనులకు సాయం

విశాలాంధ్ర-తెనాలి : స్థానిక యడ్లలింగయ్య కాలనీకి చెందిన నిరుపేద గిరిజనులకు బుధవారం ట్రైబల్స్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత అంజలి రావూరి నూతన వస్త్రాలు, బియ్యం పంపిణీ చేశారు. తమ సంస్థ ముందుగానే సర్వే చేసి గుర్తించిన నిరుపేద గిరిజనులకు, సంచార తెగలకు సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఆయా తెగల్లో కొందరు అనారోగ్యాలతో సతమతమవుతున్నారని, ఆధార్ కార్డు తప్పనిసరిగా అవసరం అని నిరాశ్రయులైన గిరిజనులకు ఆధార్‌కార్డు మంజూరు చేయవలసిందిగా సంబంధింత అధికారుల దృష్టికి తీసుకువెళతానని ఆమె చెప్పారు. ఊరు చివర్లో కాలువ కట్టలపైన, చెట్ల క్రింద నివాసం వుంటున్న నిరుపేద గిరిజనులకు వెదురు వాసాలతో తాటాకు కప్పి తాత్కాలిక వసతిని ఏర్పాటు చేస్తామని సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బొంతకృపమ్మ, అద్దంకి పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇతర రంగాల్లో కూడా రాణించాలి

విశాలాంధ్ర-తెనాలి : కొత్తపేటలోని శ్రీరామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరిగిన వైష్ణవి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఫేరవల్ పార్టీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ, ఇతర సాహిత్య, సంగీత, సాంస్కృతిక రంగాలలో కూడా అభివృద్ధి చెందాలని చైతన్యవంతులుగా ఉంటూ అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని హితవు పలికారు. కళాశాల డైరెక్టర్ పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. శివకుమార్ తన ప్రసంగంలో విద్యార్థులు ముఖ్యంగా సమాజసేవకు అంకితం కావాలని, విద్యలో ఉన్నతస్థాయికి ఎదగాలని అన్నారు. విద్యతోపాటు మన సాంప్రదాయాలను, సంస్కృతిని పాటించాల న్నారు. చిన్నతనం నుండే పెద్దలను, ఉపాధ్యాయులను గౌరవించడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్ర మంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు భరతనాట్య ప్రదర్శనలు, జానపద నృత్యాలు ప్రదర్శించారు.

ఉపకరణాల కోసం ఉచిత నిర్ధారణ పరీక్షలు

విశాలాంధ్ర-తెనాలి : తాలూకా హైస్కూల్ నందు సమగ్రశిక్ష గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల కోసం ఉచిత నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమం సమగ్ర శిక్ష గుంటూరు జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జి. విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ బుద్ధిమాంద్యం, వినికిడి, దృష్టి లోపాలున్న వారికి పరీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు శారీరక వైకల్యం ఉన్నవారికి వీల్‌ఛైర్స్, ట్రైసైకిల్స్, రోలేటర్స్, బుద్ధిమాంద్యం ఉన్న వారికి యంఆర్ కిట్స్, కంటిచూపు దెబ్బతిన్న వారికి బ్రెయిలీ కిట్లు అందిస్తామని తెలియజేశారు. ప్రభుత్వం వాటిని ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఉచిత వైద్య శిబిరాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమగ్రశిక్ష గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో భవిత కేంద్రాలలో ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, ప్రత్యేక అవసరాలుగల పిల్లలకు రవాణా అలవెన్స్, ఎస్కార్ట్ అలవెన్స్, హెచ్‌బిఎ అలవెన్స్, రీడర్ అలవెన్స్, గరల్స్ స్టైఫండ్ ప్రభుత్వం అందజేస్తుందని ఆమె తెలిపారు. తెనాలి డివిజన్‌లో జరిగిన పరీక్షల్లో సహిత విభాగానికి చెందిన వారు పాల్గొన్నారని సమన్వయ కర్త ఎన్.శ్రీనివాసరావు చెప్పారు. మండలం విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం స్థానిక స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రత్యేక అవసరాల పిల్లలకు భవితా కేంద్రాన్ని లక్ష రూపాయలతో అభివృద్ధి చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు, సైకాలజిస్ట్, ఆప్తమాలజిస్ట్ చెవి ముక్కు గొంతు కంటి డాక్టర్‌లు, ఐ యి ఆర్. పి లు ఫిజియోథెరపిస్టు, స్పీచ్‌థెరపిస్టు, ఆడియాల జిస్టులు పాల్గొని పరీక్షలు నిర్వహించారు. అర్హత కలవారికి సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉపకరణాలు అందిస్తామని తెలిపారు.

కోర్టు నోటీసు

మహారాజశ్రీ గుంటూరు 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.యస్.నెం: 1205 / 2022

విట్నీస్:
కెనరా బ్యాంక్,బ్రాడీపేట బ్రాంచి,రిఫ్.బై.ఇట్స్ మేనేజర్, గుంటూరు - వాది
మరియు
పసుపులేటి నాగేశ్వరరావు వగైరా - ప్రతివాదులు

To,
1వ ప్రతివాది: పసుపులేటి నాగేశ్వరరావు, తండ్రి. జగన్‌రావు,
2వ ప్రతివాది: పసుపులేటి శివలీల, భర్త. నాగేశ్వరరావు, ఇరువురి నివాసం. డోర్ నెం: 63-7-803, బాలాజీ నగర్ 5వ లైను, పాత గుంటూరు, గుంటూరు.

పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించి నను మీరు తీసుకొనక కాలయాపన చేయుచు న్నందున శ్రీ కోర్టు వారు మీకు Substitute Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు **డి: 23-03-2023**న **ఉ. గం. 10-30 ని.లకు** పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అక్షేపణలు తెలియపరచు కొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపరచటమైనది.

వాయిదా తేదీ: 23-03-2023
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కె.ప్రసన్న, వాది తరపు న్యాయవాది,
ఫ్లాటు నెం: 004,
మయూరి నందన అపార్ట్‌మెంట్,గుంటూరు.

LOSS OF PASSPORT

I, TALLAPANENI BHARGAVI, D/o. Tallapaneni Ramarao, R/o. D.No.19-13-132, 5th Lane Gandhi Nagar, Sangadigunta, Guntur, Guntur District, A.P. I lost **my Original Passport No.U8918559 on 31-12-2020** while I was travelling from My Home to RTC Busstand for taking Xerox by Auto. If anybody found it please inform me through **Cell No.8309177732**

బహిరంగ ప్రకటన

నా క్లయింటు గుంటూరు జిల్లా , తాడేపల్లి మండలం పెద వడ్లపూడి గ్రామ వాస్తవ్యులు చిగురుపాటి సుబ్బారావు గారి కుమారుడు చిగురుపాటి నాగేశ్వరరావు గారి ద్వారా సంజాయిషి పొందిన పిమ్మట యావన్మందికి తెలియజేయునది ఏమనగా!

నా క్లయింట్ తండ్రిగారు అయిన చిగురుపాటి సుబ్బారావు గారు డి. 14-05-1992 తేదిన గుంటూరు జిల్లా రిజిస్ట్రారు ఆఫీసు నందు ఒక వీలునామా రిజిష్టారు కాబడినది. అయితే నా క్లయింట్ తండ్రి గారు కాలక్రమంలో చని పోయినారు. నా క్లయింట్ యొక్క తండ్రి చనిపోయినందున వీలునామా వ్రాసి రిజిష్టారు కాబడిన ఆస్థి నా క్లయింట్స్ సంక్రమించి తదాది నుండి నుండి నేటి వరకు సదరు స్థిరాస్తిని నా క్లయింట్స్ సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్త్యములతో నిర్వివాదముగా అనుభవించుచున్నారు. ఇట్టి స్థితిలో సదరు స్థిరాస్తి సంబంధించిన నా క్లయింట్స్ వారి వారి పేరా పట్టాదారు పాసు పుస్తకము మరియు టైటిల్ డీడ్ పుస్తకములు పొందు నిమిత్తము సంభందిత అధికారి అయిన శ్రీ మంగళగిరి తహసిల్దార్ గారికి అర్జీ దాఖలు చేసికొని యున్నారు.

చిగురుపాటి నాగేశ్వరరావు 1వ పార్టీ వారికి చెందు ఆస్తి వివరాలు :- గుంటూరు జిల్లా మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామ రెవిన్యూ రీసర్వే నెం:474/1ఎ లలో 1) బాగము యు 0.80 సెంట్లు మరియు మరియు 2వ భాగము య0.96 సెంట్లు వెరశి 1.76 సెంట్లు .1వ బాగమునకు యు 0.80 సెంట్లుకు హద్దులు : తూర్పు పెద వెంకయ్య గుంట, దక్షిణం: అన్నే రామకృష్ణ గారి భూమి , ఉత్తరము : యేళ్ళ రాఘవయ్య గారి భూమి, పడమర: యేళ్ళ రాఘవయ్య గారి భూమి, 2వ భాగము య0.96 సెంట్లుకు హద్దులు: తూర్పు: యేళ్ల రాఘవయ్య గారి భూమి, దక్షిణం: యేళ్ళ రాఘవయ్య గారి భూమి, ఉత్తరం : దగాని సంగీతరావు గారి భూమి, పడమర : షేక్ ఖాశింబుదే సాహెబ్‌గారి భూమి.

2వ పార్టీ చిగురుపాటి వెంకటేశ్వరరావు వారికి చెందు వివరాలు : గుంటూరు జిల్లా మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామ రెవిన్యూ 1వ భాగము రీసర్వే నెం:397లో యు 0.90 సెంట్లు మరియు మరియు 2వ భాగము సర్వే నెం: 398 య0.35 సెంట్లు వెరశి 1.25 సెంట్లు

1వ బాగము : యు.0.90 సెంట్లుకు హద్దులు: తూర్పు : బోయపాటి అవినాష్ భూమి హద్దు, దక్షిణం: కణతల నాగరత్నం గారి భూమి హద్దు, ఉత్తరం: నాగళ్ల నాగరత్నంగారి భూమి హద్దు, ఉత్తరం : నాగళ్ల సాంబ్రాజ్యం గారి భూమి హద్దు, పడమర : పంటకాలవ పోరంబోకు హద్దు. ఈ హద్దుల మధ్య యు. 0.90 సెంట్లు

2వ బాగము : 35 సెంట్లుకు హద్దులు తూర్పు : చల్లపల్లి సాంబశివరావు గారి భూమి హద్దు దక్షిణం: బోయపాటి అవినాష్ భూమి హద్దు, ఉత్తరం : నాగళ్ల సాంబ్రాజ్యం గారి భూమి హద్దు , పడమర: బోయపాటి అవినాష్ భూమి హద్దు, ఈ హద్దుల మధ్య యు.0.35 సెంట్లు పై తెల్పిన నా క్లయింట్స్ యొక్క ఆస్తులను వారి వారి నాటాల జాబితాల ప్రకారం వారి పంటలు పండించు కొనుచున్నారు. సదరు ఆస్తులపై ఈ పేపరు ద్వారా ప్రకటన చేయటమైనది. కావున పై తెలిపిన విషయమై ఎవరికైన ఏవిధమైన అభ్యంతరాలు గానీ , ఆక్షేపణలు గానీ, హక్కులు గానీ వున్నయెడల 7 రోజులలో తగు ఆధారలతో శ్రీ మంగళగిరి తహశిల్దార్ గారికి గాని ఈ దిగువ అడ్రసుకు గానీ, తెలియజేయగలరు.

ఇట్లు :-
Dt.28-02-2023,
Vijayawada

M.N PRASUNAMBA,@ MUNTAJ BEGAM B.comB.L
Advocate,
Dr.No: 12-2-183, 303 S.K TOWERS, OPP. ROYAL HOTEL B.R.P ROAD, ISLAMPET, VIJAYAWADA-1 PH; 98487 86956.

పాస్‌పోర్ట్ పోయినది

గుంటూరు జిల్లా, పొన్నూరు టౌన్, ఎస్టీ కాలనీ, ఇందిరానగర్ 1వ లైను, ఇటికంపాడు రోడ్డు, నిమ్రా మసీదు దగ్గర, డోరు నెం.20-3-3రు కాపురస్తులు **షేక్ ఖాదర్ మొహిద్దీన్** గారి కుమారుడు **షేక్ రియాజ్ (సెల్ : 97000 20709)** నా యొక్క పాస్ పోర్ట్ నెం. **W7713723** ఒరిజినల్‌ను **డి.22-02-2023**న నా ఇంటి వద్ద నుండి ఎస్‌పిపి రోడ్డులో గల ఫొటోస్టాట్ సెంటర్‌కు జిరాక్సు నిమిత్తం బైకుపై ప్రయాణిస్తుండగా మార్గమధ్యలో పోగొట్టుకున్నాను. ఎవరికైనా సదరు పాస్‌పోర్ట్ దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

CHANGE OF NAME

I, **MANDADI VENKATA SIVA NAGA RAJU, S/o. MANDADI BHADRAIAH,** R/o. Brundavan Fortune, Flat No.101, Udyoga Nagar, Palakaluru Road, Guntur-522007, Andhra Pradesh, India. That in My Passport bearing no: **J5481078** my name was mentioned as **MANDADI VENKATA SIVA NAGA RAJU** and in my Wife **MANDADI CHANDRAKALA's** Passport bearing no: **K8596499** is showing as **VANKAT SIVA NAGA RAJU MANDADI.** The above said names **"MANDADI VENKATA SIVA NAGA RAJU"** and **"VANKAT SIVA NAGA RAJU MANDADI"** used by myself are of one and the same person (i.e.) myself only.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

పెంచిన గ్యాస్ ధరలు ఉపసంహరించుకోవాలి: సీపీఐ

విశాలాంధ్ర-మాచర్ల: పెంచిన వంట గ్యాస్ సిలిండర్ల ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ మాచర్ల ఏరియా సెక్రటరీ మేకపోతుల శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పెంచిన వంట గ్యాస్ ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారం పడుతుందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కరువు కాటకాలతో అల్లాడుతున్న పేద ప్రజలపై ఈ నెల 1వ తేదీ నుండి డొమెస్టిక్ సిలిండర్‌కు రూ.50లు, కమర్షియల్ సిలిండర్‌పై రూ.350లు పెంచేలా కేంద్ర ప్రభుత్వ నిర్ణయం దుర్మార్గమన్నారు. పంటలు సరిగ్గా పండక, పండినవాటికి మద్దతు ధర లభించకపోవడం, నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్నంటడం, ఉపాధి కరువై సామాన్యులకు జీవనం కష్టతరంగా మారిన తరుణంలో పేద మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యేక రాయితీలను కల్పించి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఇలా ధరలను పెంచి ప్రజలను ఇబ్బంది పెట్టడం సహించరానిదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజా సంక్షేమం కరువైందన్నారు. ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని లేకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో టౌన్ సెక్రటరీ మెదక్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సీజీజీబీ నూతన శాఖ ప్రారంభం

విశాలాంధ్ర-శావల్యాపురం: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు(సీజీజీబీ) సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని కారుమంచిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆ బ్యాంకు శాఖను బుధవారం ఎమ్మెల్యే బొల్లా ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బ్యాంక్ సిబ్బంది విని యోగదారుల సేవలే ధ్యేయంగా పని చేయాలని తెలిపారు. చైర్మన్ కామేశ్వ రరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సైతం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ సేవలు అందించాలనే ముఖ్యఉద్దేశంతో ఇక్కడ బ్రాంచిని ఏర్పాటు చేశామని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బ్యాంక్ సేవలనూ సద్విని యోగం చేసుకొవాలన్నారు. ఈకార్యక్రమంలో రీజినల్ మేనేజర్ మారుతీరామ్, జనరల్ సెక్రటరీ బోడా శ్రీనివాసరావు, శావాల్యపురం శాఖాధికారి ఇలింద్రపర్తి విశ్వనాథ్, వినుకొండ శాఖాధికారి బేతపూడి రాజశేఖర్, కొచ్చర్ల శాఖాధికారి కట్టా ఉజ్వల్, ఈపూరు శాఖాధికారి డెగల రాజేష్, కారుమంచి శాఖాధికారి కాపూరి సాయి చంద్ర చౌదరి, క్యాషియర్ వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం తనిఖీ

విశాలాంధ్ర-నూజెండ్ల: మండల కేంద్రంలో గల గ్రామ సచివాలయాన్ని బుధవారం నరసరావుపేట డీఎల్‌డీవో మూల వెంకటరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం సచివా లయ సిబ్బందితో సమీక్ష నిర్వహించి సచివాలయంలో అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి గ్రామస్తులకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని, అలాగే అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో షేక్ జిలాని భాష, పంచాయతీ కార్యదర్శి రమేష్ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

విశాలాంధ్ర-నూజెండ్ల: మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, రుచికర మైన భోజనం అందాలని ఎంపీపీ మేడమ్ జయ రామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులురామయ్య అన్నా రు. మండలంలోని ములకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును సర్పంచ్ కంచర్ల బాబుతో కలిసి వారు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనాన్ని, స్టాక్ రూమ్‌ను పరిశీలించారు. చిన్నారులకు అందించే భోజనం నాణ్యత విషయంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. పట్టిక ప్రకారం రోజు వారీ మెనూను సంబంధిత ఉపాధ్యాయులు తప్పనిసరిగా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీలతాదేవి, పీఎంసీ చైర్మన్ సూరాబత్తిన వీరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు పొడిగింపు

విశాలాంధ్ర-వినుకొండ: జనసేన క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 3వ తేదీ వరకు పొడిగించారని గుంటూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి నిశ్శంకరావు శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... గడిచిన రెండు రోజులు సభ్యత్వ నమోదు విషయంలో సాంకేతిక ఇబ్బందులు వచ్చాయని, అందువలనే గడువు పొడిగించారని, ఇప్పటి వరకు జరిగిన సభ్యత్వాలలో పల్నాడు జిల్లా లోనే వినుకొండ ప్రథమ స్థానంలో ఉందని, వాలంటీర్లు బాగా పని చేసారని, ఇదే ఉత్సాహంతో రానున్న 3 రోజులు కూడా సభ్యత్వాలు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ నాయకులు శీలం నరసింహారావు, నిశ్శంకరావు అంకారావు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, చింతకాయల రామాంజనేయులు, తన్నీరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం సీసాలు పట్టివేత

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక ఆర్టీసీ డిపోలోని కార్గో పార్సిల్ సర్వీస్‌లో విజయవాడ నుంచి బస్సులో వచ్చిన ఓ పెద్ద సూట్ కేసులో 24 మద్యం సీసాలను స్థానిక ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది కనుగొన్నారు. ఈ విషయాన్ని డిపో మేనేజర్ బి.కోటేశ్వరరావు నాయక్‌కు తెలియజేశారు. కాగా ఈ మద్యం బాటిళ్లు కొన్ని దుస్తులు మేడ పి సమీపంలోని ఒక గ్రామానికి చెందిన యేసు అనే వ్యక్తి విజయవాడలో బుక్ చేశాడని డిపో మేనేజర్ వివరించారు. కాగా కార్గో పార్సిల్ సర్వీస్‌లో పట్టుబడిన మద్యం సీసాల విషయాన్ని స్థానిక ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇచ్చామని డిపో మేనేజర్ తెలిపారు. అయితే పార్సిల్‌లో వచ్చిన ఓ మద్యం బాటిల్ పగిలి మద్యం కారిపోతుండగా ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది బుధవారం ఉదయం కనుగొన్నారు.

చిన్నారులపై తల్లులకు అవగాహన

విశాలాంధ్ర - నకరికల్లు : బరువు తక్కువగా ఉన్న చిన్నారులపై తల్లులకు అవగాహన సదస్సు జరిగింది. మండలంలోని కుంకలగుంట గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో 0-6 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లల ఆరోగ్యంపై తల్లులకు ఐసిడిఎస్ అధికారులు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలను బరువు చూసి వయస్సుకు తగ్గ బరువు లేని పిల్లలను గుర్తించారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలకు బాలామృతం, గుడ్డు, పాలు వంటివి అందించారు. పిల్లలకు రోజుకు ఎన్ని గ్రాముల ప్రకారం ఆహారం అందించాలో తల్లులకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జె.వి.నాగమణి, ఎం.కళావతి, బి.భారతీ, జె.విజయ, ఎ.రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని విద్యార్థి దుర్మరణం

విశాలాంధ్ర - నకరికల్లు : కారు ఢీకొన్న ఘటనలో విద్యార్థి మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన నకరికల్లులో మంగళవారం చోటు చేసుకుంది. ప్రమాద వివరాలు ఇలా ఉన్నాయి. నకరికల్లుకు చెందిన మోరా నాగార్జునరెడ్డి (14) రోడ్డు పక్కన నిలిపి ఉన్న రిక్షా పై కూర్చోని ఉండగా పిడుగురాళ్ల వైపు నుండి వస్తున్న కారు వేగంగా వచ్చి రిక్షాను ఢీ కొంది. ఈ ప్రమాదంలో రిక్షాపై కూర్చున్న నాగార్జునరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. సురేష్ తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసంపై టీడీపీ ఆగ్రహం

విశాలాంధ్ర-శావల్యాపురం: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత నేత ఎన్టీఆర్ విగ్రహాలపై తరచూ దాడులు జరుగుతున్నాయని జడ్పీటిసి పారా హైమావతి అన్నారు. మండలంలోని ఘంటావారిపాలెం గ్రామంలో గల ఎన్టీఆర్ విగ్రహన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి ముక్కును పగలగొట్టారు. ఎన్టీఆర్ విగ్రహం ధ్వంసం ఘటన విషయం తెలుసుకున్న మండలంలోని టీడీపీ శ్రేణులు విగ్రహం వద్దకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కర్నూలు గుంటూరు జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా హైమావతి మాట్లాడుతూ పోలీస్ శాఖ వెంటనే ఘటనపై విచారణ జరిపి నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు వినుకొండ రూరల్ సిఐ రమేష్ బాబు, శావల్యాపురం ఎస్సై గల్లా రవికృష్ణ, ఈపూరు ఎస్సై విపర్ల వెంకట్రావు, బొల్లాపల్లి ఎస్సై బలరామి రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని ధర్నా చేస్తున్న టిడిపి నాయకులకు సర్ది చెప్పి ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను త్వరలోనే పట్టుకొంటామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. అనంతరం ఘటనపై స్థానిక మండల నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుంటూరు సాంబశివ రావు, గడిపూడి విశ్వనాథం, చింతా గంగయ్య, యరమాసు కోటేశ్వరరావు, బొల్లా పేరయ్య, గద్దే మస్తాన్ రావు, గోరింట్ల హనుమంతరావు, బత్తుల వెంకటేశ్వర్లు, అమృతపూడి కోటయ్య, షేక్ మస్తాన్, ఏగినాటి తిరుపతిరావు, సాదినేని కృష్ణమూర్తి, రావి మురళి కృష్ణ, పావులూరి శ్రీనివాసరావు, సూరాబత్తుని ఆంజనేయులు, పాలడుగు సత్యనారాయణ, నలమాటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

విశాలాంధ్ర-మాచర్ల: పేదల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని ఆ పార్టీ మాచర్ల నియోజకవర్గం ఇన్చార్జి డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. బుధ వారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే ఎన్నో ప్రాజెక్టులు, పరిశ్రమలు నెలకొల్పిన కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావాలన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు సోనియాగాంధీ నేతృత్వంలో రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా జోడో యాత్రల పేరిట పర్యటనలు నిర్వహిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక క్యాంపులను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మాచర్ల నియోజకవర్గం నుండి రానున్న 2024 ఎన్నికలలో పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ప్రజలు ఆదరించి ఆయన గెలుపుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సత్యనారాయణ, రాగిటి ప్రతాప్, నాగరాజు, చిమట వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్లో సైన్స్ వేడుకలు

విశాలాంధ్ర-దుర్గి : మండల కేంద్రమైన దుర్గి ఏపీ మోడల్ స్కూల్లో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కృష్ణారావు మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంలో విజ్ఞాన శాస్త్రవేత్తల ప్రగతిని స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులలో ఇమిడి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు సైన్స్ ప్రాజెక్టులను చేపట్టారు. ఉపాధ్యాయులు విద్యార్థులలోని సృజనాత్మక శక్తిని వెలికితీసి వారి ప్రగతిని గుర్తించారు. ప్రతిభావంతులైన విజేతలకు బహుమతులు అందజేసి వారిని చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఖాజావలి, వెంకటేశ్వర్లు, శివయ్య కుమార్, ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహ వైద్యంలో అవగాహన సదస్సు

విశాలాంధ్ర-బెల్లంకొండ: మండుతున్న ఎండలతో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఆయుష్ వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుతున్న ఎండలతో వడదెబ్బలు తగిలే అవకాశం ఉందని రక్షణ పొందటానికి తగినంత నీరు, మజ్జిగ, నిమ్మరసం, చెరుకు రసం సీజన్లలో లభించే కొబ్బరి బొండం నీళ్ల తరచూ తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించటం సీజన్ నుండి బయటపడవచ్చునని తెలియజేశారు. బాలింతలు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులు సమపాలలో పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు జరిపి ఆయుష్ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఆయేషా, పారి కోటేశ్వరమ్మ, హనుమంతరావు నాయక్, యోగా టీచర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే బొల్లా

విశాలాంధ్ర-శావల్యాపురం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఘంటావారిపాలెం గ్రామంలో ఏడవ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మండల స్థాయి అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వాటి వలన కలిగిన లబ్దిని వివరిస్తూ, సిఎం సంతకం చేసిన కరపత్రాలను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు, సానుభూతి పరులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందకుండా చేశారని, అలాంటి అనైతిక రాజకీయాలు తాము చేయటం లేదని వెల్లడించారు. అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకం అందాల్సిందే అనే నినాదంతో తమ ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్, సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, ఎంపిటిసి లింగా శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు తుమాటి కబ్బారావు, వైఎస్ఆర్సిపి నాయకులు తేలప్రోలు రాఘవేంద్రరావు, బొల్లికొండ బ్రహ్మనందం, పుట్టా లక్ష్మీ నారాయణ, చిలుకూరి లక్ష్మీనారాయణ, మారిశెట్టి శివరామ ప్రసాద్, కర్ణా శ్రీనివాసరావు, మలిశెట్టి నరేష్, తేలప్రోలు రవీంద్ర, చెన్నా శ్రీనివాసరావు, చెన్నంశెట్టి మణికంత, ఏడుకొండలు సాంబశివరావు, ఎంపిడివో పేరుమీన శీతారామయ్య, తహశీల్దార్ షేక్ జాన్ సైదులు, కార్యదర్శులు అశోక్ చౌదరి, యుగంధర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కేంద్రంపై మాదిగ జాతి యుద్ధానికి సిద్ధం కావాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై మాదిగ జాతి యుద్ధానికి సిద్ధపడాలని ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా కన్వీనర్ అద్దంకి బాబు మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం మాదిగల సంగ్రామ మహాపాదయాత్ర చిలకలూరిపేట నియోజకవర్గానికి చేరుకున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. పాదయాత్ర బృందానికి నియోజకవర్గ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పాదయాత్రగా స్థానిక ఎన్నార్టీ సెంటర్ నందు గల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబు మాదిగ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వమైన బిజెపి మాదిగలను నమ్మించి మోసం చేసిందని తెలిపారు. రానున్న ఎన్నికలలో రాష్ట్రంలో, కేంద్రంలో వర్గీకరణకు సహకరించని పార్టీలకు తగిన బుద్ధి చెబుతామని ఆయన అన్నారు. శవల్యాపురం నుంచి ప్రారంభమైన పాదయాత్ర మార్చి 14వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించి అనంతరం మార్చి 15వ తేదీ రాజధాని ముట్టడి కార్యక్రమంలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొర్నెపాటి మల్లిక, కొండపాగ క్రాంతి, ప్రత్తిపాటి కోటి, కేసనపల్లి కిషోర్, కోట చంటి, బిరుదు కిరణ్ కుమార్, తమ్ములూరి అనిల్, ముట్లూరి అనసూర్యమ్మ, గుడిమెట్ల పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ వద్ద అలుముకున్న అంధకారం

విశాలాంధ్ర-విజయపురిసౌత్: తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణగా పేరుగాంచిన నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రధాన ముఖ ద్వారం వద్ద హైమాస్ట్ లైట్‌లు గత కొంతకాలంగా పనిచేయకపోవడంతో డ్యామ్ పరిసర ప్రాంతాలు అంధకారంగా మారాయి. ప్రాజెక్టు భద్రతకు కోట్లాది రూపాయల వెచ్చించే ప్రభుత్వాలు ప్రధాన గేట్ల ముందు హైమాస్ట్ లైట్ల మరమ్మతులను పట్టించుకోకపోవడం గమనార్హం. రాత్రి అయితే ప్రాజెక్టు పరిసరాల్లో అంధకారం అలుముకుంటోంది. దీనితో ఏ క్షణాన్న ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రాజెక్ట్ ప్రధాన ద్వారం వద్ద చిమ్మచీకట్లు అలుముకోవడంతో డ్యామ్ భద్రత పై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. సీసీ కెమెరాలు ఉన్నా చీకట్లో ఏం జరుగతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రాజెక్ట్ అధికారులు అలసత్వం వీడి డ్యామ్ ముఖ ద్వారం వద్ద హైమాస్ట్ లైట్ల మరమ్మత్తులను తక్షణమే చేపట్టాల్సిన అవసరం ఉంది.

మానవత్వం చాటుకున్న వాలంటీర్

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో మాచవరం గ్రామానికి చెందిన వికలాంగురాలు నాగినీడి సైదమ్మ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గుంటూరులో ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆ గ్రామానికి చెందిన గ్రామ వాలంటీర్ వడిచర్ల రాజేశ్వరరెడ్డి వికలాంగురాలు అయిన సైదమ్మకు వికలాంగ పెన్షన్ ఇచ్చేందుకు ఇంటికి వెళ్ళగా ఆమె లేరని తెలుసుకుని వెంటనే గుంటూరు బయలుదేరి వెళ్లారు. గుంటూరులో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సైదమ్మకు వికలాంగ పెన్షన్ పంపిణీచేశారు. వాలంటీర్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి తిరునాళ్ళ

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో గోగులపాడు గ్రామంలో వేంచేసియున్న సువర్చల సమేత శ్రీ అభయాంజనేయస్వామి తిరునాళ్ళ బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా, అందంగా అలంకరించి విశేష, సహస్రనామ, కుంకుమార్చన అలంకరణ పూజలు నిర్వహించారు. గ్రామంతోపాటు పరిసర గ్రామ స్తులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్ళు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం వేళల్లో గ్రామంలో నుండి గుడి వద్దకు మొక్కుబడి ప్రభలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. తిరునాళ్ళ సందర్భంగా రాత్రి వేళల్లో గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎస్ ఐ సిహెచ్ సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయటం జరిగింది.

17 నుంచి బీ2బీ మెడికల్ ఉపకరణాల ట్రేడ్ ఫెయిర్

విశాలాంధ్ర-గుంటూరు : మెడ్ ఎక్స్పర్ట్ బిజినెస్ కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించే అతిపెద్ద బీ2బీ మెడికల్ ఉపకరణాల ట్రేడ్ ఫెయిర్ అయిన మెడీకాల్ మార్చి 17 నుంచి 19 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంట ర్‌లో జరుగుతుంది. ఈ మెడీకాల్ 32వ ఎడిషన్ సర్జికల్ కాటన్ నుంచి అధునాతన ఇమేజింగ్ పరికరాలు, శస్త్రచికిత్సా ఉపకరణాల వరకు ఆసుపత్రిలోని అన్ని అవస రాలపై దృష్టి పెడుతుంది. మెడీకాల్ వారు షోస్టాపర్ అయిన ఒక ఇంటరాక్టివ్ బ్రెయిన్ స్టార్మ్ కూడా నిర్వహిస్తు న్నారు. వైద్యం నిర్వహణ కలిసి మేధోపరంగా ఉత్తేజపరిచే సెమినార్లు, వర్క్‌షాపులు, అన్కాన్ఫరెన్స్‌లు, ఆసుపత్రులని నడపడం లోని వ్యాపార అంశాలపై పరిజ్ఞానాన్ని పొందడానికి, వ్యాప్తి చేయడానికి మెడికల్ ఫ్రైటర్నిటీ కోసం ఓపెన్ డిస్కషన్ సెషన్లని అందిస్తుంది. హెల్త్‌కేర్ పరిశ్రమలో ఉపయోగించే కొత్త నైపుణ్యాలు, సాంకేతికతలపై ప్రత్యక్ష అనుభవాన్ని ప్రేరేపిస్తుంది.

సాగర్ నీటిని వారబందీ పద్ధతిలో వాడుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఈ వాటర్ ఇయర్ 2022-2023లో నాగార్జున సాగర్ కుడికాలువకు కేటాయించబడిన నీటిని ఈ నెల 6వ తేదీ నుంచి నీటి లభ్యతను అనుసరించి వారబందీ పద్ధతిలో వాడుకోవాలని నిర్ణయించినట్టు పర్యవేక్షక ఇంజనీర్ ఎం.మురళీధర్ తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు కాలువలకు నీటి సరఫరా నిలిపివేయబడునని తెలిపారు. 12వ తేదీ నుండి 20 తేదీ వరకు కాలువలకు నీటి సరఫరా చేయబడునని తెలపారు. 6 రోజులు ఆఫ్, 9 రోజులు ఆన్ పద్ధతిలో నాగర్జున సాగర్ నందు నీటి లభ్యతను అనుసరించి పంట కాలువలకు వారబందీ విధానంలో నీటి సరఫరా చేస్తారని తెలిపారు.

10th,ఇంటర్ సర్టిఫికెట్లు పోయినవి

బోద వెంకటేష్ తండ్రి సోమయ్య అను నేను పల్నాడు జిల్లా, మాచర్ల మండలం, కొప్పునూరు పంచాయతీ పరిధిలోని, లచ్చం బావి గ్రామ నివాసి నైయున్నాను. అయితే గత నెల 20న మా స్వగ్రామమైన లచ్చంబావి నుండి పని పై మాచర్లకు బస్సులో వెళ్లి వస్తుండగా నాకు సంబంధించిన టెన్త్ క్లాస్ మార్క్స్ మెమో **Reg no: 1814122295**, ఇంటర్ మార్క్స్ మెమో **Reg no: 2006238489** లు గల సర్టిఫికెట్లు మిస్ అయినవి. ఎంత వెతికిననూ కనబడటం లేదు. ఎవరికైనా దొరికిన యెడల సెల్ నెం : **8639318332** కు తెలియజేయగలరు.

వైసీపీ గెలుపునకు కృషి చేయాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నరసరావుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి గెలిపించేందుకు వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన శిక్షణ కార్యక్రమ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈనెల 24నుండి నియోజకవర్గంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని, ఈ కార్యక్రమంలో వార్డు వాలంటీర్లు, గృహ సారధులు, సచివాలయం కన్వీనర్లు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి గడపకు వెళ్లి వివరించాలని, ప్రతి ఇంటి ముందు పోస్టర్లు అంటించాలని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలను ప్రతి ఒక్కరికి తెలియజేయడమే మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. సమావేశంలో పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఎంపీపీ అధ్యక్షులు శ్రీనివాసరావు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పాలవెల్లువ పథకంతో మహిళా రైతులకు ప్రయోజనం

విశాలాంధ్ర-బొల్లాపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా మహిళా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలంలోని గుమ్మనంపాడు గ్రామ పశు వైద్యాధికారి పి.సాల్మన్ సింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని అయనపాలెం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సేవలను వివరించారు. 1962 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయడం ద్వారా వైద్య బృందం నేరుగా పశువుల వద్దకు చేరుకొని మెరుగైన వైద్య చికిత్సలు చేస్తారని అలాగే పశువుల కోసం ప్రత్యేకంగా అంబులెన్స్ సౌకర్యం కూడా అందుబాటులో ఉందని ఆయన వెల్లడించారు. ఈ పథకాలన్నిటిని రైతులు అవగాహన చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అయనపాలెం సర్పంచ్ పి.సాయి బాబా, గుమ్మనంపాడు పశు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో టైలర్ల పాత్ర కీలకం

విశాలాంధ్ర-చిలకలూరిపేట : సమాజములో టైలర్ల పాత్ర చాలా కీలకమైనది జ్ఞానేశ్వర ఫౌండేషన్ చైర్మన్ షేక్ జాన్ సైదా అన్నారు. ప్రపంచ టైలర్స్ దినోత్సవం సందర్భంగా చిలకలూరిపేట పట్టణములోని సాల్ బుడే షాదీఖానాలో జ్ఞానేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో జాన్ సైదా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న టైలర్ల కుటుంబాలలో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఉంటే వారి ఉన్నత చదువులకు తమ ఫౌండేషన్ అండగా ఉండి ఆర్థిక సహాయం చేస్తుందని జాన్ సైదా అన్నారు. నాదెండ్ల మండల మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి మాట్లాడుతూ సమాజ సేవ చేస్తున్న జాన్ సైదా నేటి యువతరానికి ఆదర్శమని అన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న ఏడుగురు టైలర్లకు రూ.2 వేల చొప్పున రూ.14 వేలను అందజేశారు. చిలకలూరిపేట టైలర్స్ అసోసియేషన్ సభ్యులు జాన్ సైదాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, మున్సిపల్ మాజీ ప్రతిపక్షనాయకులు నాయుడు వాసు, షేక్ అబ్దుల్ రవూఫ్, 15వ వార్డు కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, బీవీ రెడ్డి, కారచోల విజయభాస్కర్ రెడ్డి, షేక్ కరిముల్లా, జమ్మలమడక ఆదిబాబు, మానుకొండ శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధర పలుకుతున్న యశ్వంత్-28 హైబ్రిడ్ మిరప..

విశాలాంధ్ర-వినుకొండ: గత రెండేళ్లుగా నష్టపోతున్న మిరప రైతుకు ఈ ఏడాది లాభసాటిగానే ఉంది. ఈ సంవత్సరం వేసిన మిరపలో యశ్వంత్-28 ప్రభాకర్ హైబ్రిడ్ సీడ్ ప్రైవేట్ లిమిటెడ్ వారి మిరప విత్తనం అధిక దిగుబడులను మిగిల్చింది. ఈ కంపెనీ రకం విత్తనాలు నాటిన రైతుకు ఎకరానికి 35 నుండి 40 క్వింటాల వరకు మిరప దిగుబడి వచ్చింది. ప్రకాశం జిల్లా కొనకలమెట్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సురవరపు ఆదిరెడ్డి ఏడాది యశ్వంత్-28 రకం మిరప విత్తనం సాగు చేసి ఇప్పటికి రెండు కోతలు కోయగా ఎకరానికి 25 క్వింటాళ్లు మిరప దిగుబడి వచ్చింది. కంపెనీ రీజినల్ మేనేజర్ ద్వారకనాథ, రామకృష్ణ బృందం మిరపను పరిశీలించి రైతులు వివరాలు అడిగి తెలుసుకుని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్ మాట్లాడుతూ యశ్వంత్- 28 రకం మిరప విత్తనం వినుకొండ కేంద్రంగా ప్రకాశం జిల్లా పుల్లల చెరువు, త్రిపురాంతకం, కురిచేడు, కొనకలమిట్ల, తదితర మండలాల్లోని గ్రామాల్లో అధిక శాతం రైతులకు ఇవ్వటం జరిగిందన్నారు. సాగుచేసిన మిరప పంటలను మేము సందర్శించడం జరిగిందన్నారు. పంట దిగుబడిలో తాలు శాతం తక్కువగా ఉందన్నారు. ఎర్ర నల్లి తామర పురుగు ప్రభావం ఉన్నప్పటికీ యస్వంత్-28 మిరప విత్తనం తట్టుకొని రైతుకు మంచి దిగుబడినిచ్చిందన్నారు. ప్రస్తుతం ఈ రకం మిరప మార్కెట్లో అధిక ధర సుమారు క్వింటాకు రూ.23 వేలు పలుకుతుందన్నారు.

GENERAL NOTICE
మహారాజశ్రీ గురజాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.P. No. 28 / 2022

పిటీషన్:
బొమ్మనబోయిన పేరయ్య, **S/o**.గంగయ్య,వయస్సు:38సం॥రాలు, **R/o**.హెచ్.నెం.3- 10/ఎ, కోలగొట్ల గ్రామం, దుర్గి(మం), పల్నాడు జిల్లా ...వాది

మరియు

1)కతారి కొండయ్య,**S/o**.పున్నయ్య,వయస్సు:28సం॥రాలు,**R/o**.హెచ్.నెం.3-9 కోల గొట్ల గ్రామం,దుర్గి(మం),పల్నాడుజిల్లా. 2)కతారి ముసలయ్య, **S/o**.పిచ్చయ్య, వయస్సు:50సం॥రాలు, **R/o**.హెచ్.నెం. 3-7,3)కతారి చిన అచ్చయ్య, **S/o**.పిచ్చయ్య, వయస్సు:30సం॥రాలు, హెచ్.నెం.3-21, 4)బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, **S/o**.గంగయ్య,వయస్సు:40సం॥రాలు, హెచ్.నెం.3-18, 5)బొమ్మనబోయిన పెద్దవెంకటేశ్వర్లు, **S/o**.గంగయ్య,వయస్సు:60సం॥రాలు, హెచ్.నెం.3-6, 6)అంగిడి వెంకటయ్య, **S/o**.ముసలయ్య, వయస్సు:50సం॥రాలు, హెచ్.నెం.3-5,7)పోటి చిన్న వెంకటేశ్వర్లు,**S/o**.సోమయ్య,వయస్సు:65సం॥రాలు, హెచ్.నెం.3-13,8)గరిగి వెంకపగిరి,**S/o**.కనకయ్య, వయస్సు:64సం॥రాలు, హెచ్.నెం. 3-16,9)బండారి పాండు, **S/o**.సోమయ్య, వయస్సు:50సం॥రాలు, హెచ్.నెం.3-21, 10)గాలి సైదారావు,**S/o**.గాంధి,వయస్సు:44సం॥రాలు,డోర్.నెం.3-24,11)చందారపు వెంకటేశ్వర్లు, **S/o**.చంద్రయ్య,వయస్సు:60సం॥రాలు,డోర్.నెం.3-22. ప్రతివాదులు 1 నుండి 11 వరకు గల వారి అడ్రస్ కూలగుట్ల గ్రామం, దుర్గి(మం), పల్నాడు జిల్లా, 12)పలపాల గోవిందయ్య,**S/o**.కొండలు, వయస్సు:55సం॥రాలు, హెచ్.నెం.1-10,ముచ్చర్లపాడు, దుర్గి (మం),పల్నాడుజిల్లా,13)కట్టెబోయిన వీరాంజి,**S/o**.పెద్ద వెంకటేశ్వర్లు, వయస్సు: 35సం॥రాలు,హౌస్.నెం.3-11,ముటుకూరు గ్రామం,దుర్గి(మం),పల్నాడు జిల్లా, 14)గుమ్మ పుల్లయ్య, **S/o**.బసవయ్య, వయస్సు:53సం॥రాలు,హౌస్.నెం.3-3, జంగమేశ్వరపురం, గురజాల(మం), పల్నాడుజిల్లా,15)గోసుల హనుమయ్య, **S/o**.మట్టయ్య, వయస్సు:63సం॥రాలు, హౌస్.నెం. 2-7,16)సవకాల కొండలు, **S/o**.వెంకటప్పయ్య, వయస్సు:53సం॥రాలు,17)మాచర్ల గురవయ్య,**S/o**.కోటయ్య,వయస్సు:40సం॥రాలు,డోర్.నెం.1-1,18)బొమ్మనబోయిన వెంకయ్య, **S/o**.చౌదయ్య,వయస్సు:65సం॥రాలు, ప్రతివాదులు 15 నుండి 18 వరకు గల వారి అడ్రస్ మాచర్లటౌను, పల్నాడుజిల్లా, 19)కంపసాటి చినగోవిందు, **S/o**.ముసలయ్య,వయస్సు:63సం॥రాలు, హౌస్ నెం.1-7, **S/o**.భైరవునిపాడు, దుర్గి(మం),పల్నాడుజిల్లా,20)The Official Receiver, Guntur. ...Respondents

పైనెంబరు దావాలోని పిటీషనర్ తనను ఇన్‌సాల్వెంట్‌గా ప్రకటించమని ఇందలి ప్రతివాదులపై ఐ.పి.ని దాఖలుచేసి యున్నారు. సదరు ఐ.పి.లో ఏమైనా అభ్యంతరములు వున్నయెడల ఈ ఐ.పి.లో చూసిన ప్రతివాదులు కాకుండా ఇంకా ఎవరైనా వున్నయెడల సదరు కోర్టువారి ఎదుట **ది.06-03-2023**న ఉ॥గం॥**10.30**ని॥లకు హాజరై మీఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనగలరు. లేనియెడల మీపరోక్షమందు నిర్ధారించబడును.

వాయిదా తేది : 06-03-2023.

కె. ఏడుకొండలు, యం. ప్రసాదరావు,
పి.బి.యస్. రాజు, అడ్వకేట్స్,గురజాల. సెల్:9866218101

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

విద్యతోనే ఉన్నత స్థాయికి..

విశాలాంధ్ర - చీరాల : జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలంటే విద్య ద్వారానే సాధ్యమని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఇస్తర్ల బాబురావు అన్నారు. చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చీరాల సెయింట్ మార్క్ లూథరన్ జూనియర్ కళాశాలలో విద్యార్థినీవిద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు రూ.25వేల ఆర్థిక సహాయాన్ని కాలేజీ ప్రిన్సిపాల్ పి.సునీతకి అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబూరావు మాట్లాడుతూ పరీక్షల సమయం కాబట్టి వారు ఇంటికి వెళ్లి భోజనం చేసి రావడానికి సమయం వృధా అవుతుందని, ఏకాగ్రత దెబ్బతింటుందని, కళాశాలలోనే భోజనం చేసి బాగా చదువుకొని పరీక్షలలో ఉత్తర్ణులు కావాలని అన్నారు. చదుకున్న కాలేజీకి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల కృష్ణమూర్తి, పోలుదాసు రామకృష్ణ, కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్, ప్రిన్సిపాల్ పిసునీత, జి పుష్పరాజ్, అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు నియంత్రించాలి

విశాలాంధ్ర - చీరాల : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయిన నేటికి దళితులపై దాడులు జరుగుతున్నా యంటే పాలకులు దేశాన్ని ఎటు నడిపిస్తున్నారో ఆలోచించాలని దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ జిలాని అన్నారు. బుధవారం దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో బహుజనులపై దాడులు ఆపాలని చీరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేసి డిప్యూటీ తహశీల్దార్‌కి వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని మాట్లాడుతూ దేశంలో ఎక్కడ చూసినా ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని,దాడులు నియంత్రించాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తుందని అన్నారు. పీఠాపురంలో దళిత యువకుడిని అగ్రవర్ణాల వారు వడ్డీకి డబ్బులు ఇచ్చి తిరిగి ఇవ్వలేదనే నెపంతో కులం పేరుతో దూషిస్తూ దాడి చేసారని మానసిక వేదనకు లోనైన బాధితులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. రాష్ట్రంలో యువతను ఉద్యోగ ఉపాధి వైపు నడిపిస్తూ రాష్ట్రాన్ని, అభివృద్ధి వైపు నడిపించాల్సింది పోయి కులపరమైన వివక్ష వైపు నడిపిస్తున్నారని అన్నారు. దళితులపై ఇలాంటి దాడులను ఖండిస్తూన్నామని,ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా ధర్నాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ నజీర్ షేక్ బుజ్జి,షేక్ అబ్దుల్ ఖాదర్,షేక్ ఇబ్రహీం,విజయ్, యోహాను, కృపారావు,షేక్ జిలాని,బాల అంకమ్మరావు పాల్గొన్నారు.

నిబంధనలు ఉపాధ్యాయులు పాటించాలి

విశాలాంధ్ర-పర్చూరు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులు పనిచేయాలని బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి పీజేవీ రామారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పర్చూరు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రాథమిక బాధ్యతగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఉంటారని, విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజు తన పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలను తనిఖీలు చేసి నివేదికను అందించాలని ఆదేశించారు. ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాధికారులు విధిగా పాఠశాలల తనిఖీలు చేసి తగు సూచనలు, సలహాలను ఇవ్వాలని అన్నారు. ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. సమావేశంలో నాడు-నేడు పథకం జిల్లా నోడల్ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎంఈఓ నాగేశ్వరరావు, పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, చినగంజాం, ఇంకొల్లు, కారంచేడు మండలాలలోని ఎంఈఓలు, వెలుగు ఏపిఎంలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, నోడల్ హెచ్ఎంలు, సిఆర్పీలు ఉన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

విశాలాంధ్ర - వేటపాలెం : వేటపాలెం రైల్వే స్టేషన్లో బుధవారం వేటపాలెం నుండి ఒంగోలు వైపు సిమెంటు దిమ్మలతో వెళుతున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. రైలు డ్రైవరు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రెండు గూడ్స్ బోగీలు పట్టాలు తప్పయి. సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకొన్న రైల్వే సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపట్టారు. గత కొన్ని నెలల క్రితం కూడా అదే రైల్వే ట్రాక్ పై పట్టాలు తప్పిన సంఘటన జరిగింది. ప్రమాదం జరిగింది గూడ్స్ రైలు కావడంతో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంసిద్ధం: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు సమర్థంగా నిర్వహించడానికి సంసిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.విజయకృష్ణన్ తెలిపారు. శాసనమండలి ఎన్నికల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి.లతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా బుధవారం వీడియో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి.లకు ఆయన పలు సూచనలు చేశారు. కలెక్టరేట్ నుంచి వీడియో సమావేశానికి హాజరైన కలెక్టర్ జిల్లాలో పరిస్థితులపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి క్షుణ్ణంగా వివరించారు. శాసనమండలి ఎన్నికలకోసం బాపట్ల జిల్లాలో 40 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల కోసం 27 పోలింగ్ బూతులు, ఉపాధ్యాయ ఓటర్ల కోసం మరో 13 పోలింగ్ బూతులు ఏర్పాటు చేశామన్నారు. 28,179 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని వివరించారు. ఓటర్లకు స్లిప్పుల పంపిణీ ప్రక్రియ ఇప్పటికే మొదలయ్యిందన్నారు. ఎన్నికల సామాగ్రి కొనుగోలు కోసం జిల్లాస్థాయి కమిటీ సమావేశం ఇప్పటికే నిర్వహించామన్నారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడానికి సమగ్ర ప్రణాళిక రూపొందించామన్నారు. ప్రకాశం జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ శిక్షణలు ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల బూతులో ఎన్నికల సరళిని పర్యవేక్షించడానికి వెబ్ క్యాస్టింగ్ పనితీరుపై ఇంజినీరింగ్ విద్యార్థులకు ఈ నెల మూడవ తేదీన ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నామన్నారు. ఎన్నికల కోసం సి.సి. కెమెరాలు కూడా జిల్లాకు అందాయని, వాటిని త్వరగా పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేస్తామన్నారు. గత అనుభవాల దృష్ట్యా తొమ్మిది సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకునేలా అధికారులకు పలు సూచనలు చేశామని రాష్ట్ర ఎన్నికల అధికారికి జిల్లా కలెక్టర్ వివరించారు. శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో బాపట్ల జిల్లాలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్.పి. వకుల్ జిందల్ రాష్ట్ర ఎన్నికల అధికారికి వివరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా 600 మంది పోలీసులను బందోబస్తు కోసం నియమించా మన్నారు. అలాగే 13 స్ట్రైకింగ్ ఫోర్స్, ప్లటూన్లను కూడా నియమించామన్నారు. సమస్యాత్మక, తీవ్ర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ ప్రత్యేక పోలీస్ బలగాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లకు ఎలాంటి విఘాతం కలుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గన్ లైసెన్స్ పొందిన 22 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికలు జరిగే ఆయా మండలాల సరిహద్దులలో స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాల నిఘా నిరంతరం కొనసాగుతుందన్నారు. పటిష్ట బందోబస్తు మధ్య ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నామని ఎస్.పి. చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, డి.ఆర్.ఓ. జిల్లా కె.లక్ష్మీశివజ్యోతి పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డులో క్లైయిమ్స్ త్వరితగతిన అందించాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర - కర్లపాలెం : భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డులోని క్లైయిమ్స్‌ను వెంటనే కార్మికులకు అందించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు షేక్ కరిముల్లా తెలిపారు. కర్లపాలెం కార్మికుల భవనం వద్ద బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికి ఆర్థిక సహాయం చేస్తున్నారు కానీ కార్మికులను విస్మరించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్నారని కార్మికుల సంక్షేమం కోసం ఏఐటీయూసీ పోరాట ఫలితంగా 2005లో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారన్నారు. సేస్‌ల ద్వారా వసూళ్ల చేసిన డబ్బులను గత రాష్ట్ర ప్రభుత్వం కొంత నగదును వాడుకుందన్నారు. నేటి జగన్ ప్రభుత్వం పూర్తిగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులోని డబ్బులను వినియోగించుకుంటున్నారన్నారు. కోవిడ్ సమయంలో ఇసుక లేక కార్మికులు బయటికి రాక ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యారని అనేకసార్లు కార్మిక కుటుంబాలకు రూ.10వేలు ఆర్థిక సాయం చేసి ఆదుకోమని తెలియజేసిన ముఖ్యమంత్రి నోరు మెదపలేదన్నారు. సెస్ బోర్డు ద్వారా వసూలు చేసిన డబ్బుని కార్మికుల బిడ్డల పెళ్లికి, గర్భిణీలకు, ఇతర అవసరాలకు ఇచ్చేవారని నేడు పూర్తిగా ఎత్తివేశారన్నారు. సుమారు 32000 క్లైయిమ్స్ పెండింగ్లో ఉన్న దాని గురించి పట్టలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి అల్లాడుతుంటే ఇది చాలదు అన్నట్టు మళ్లీ వంటగ్యాస్ ధరలు పెంచారని విమర్శించారు. ఈ ప్రభుత్వ విధానాలు కార్మిక వర్గాన్ని ఆర్థికంగా కుంగిపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు జెల్ది భాగ్య శ్రీధర్, రైతు సంఘం నాయకులు అక్కల నాగిరెడ్డి, భవన నిర్మాణ కార్మికులు షంసుద్దీన్, అక్కల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహోత్సవాలు విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - భట్టిప్రోలు : శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బ్రహోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పరిచేయాలని మండల తహశీల్దార్ ఎంఎల్. శ్రావణ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం కమిటీ సభ్యులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం రథోత్సవం జరిగే రూట్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. బ్రహోత్సవాలలో ముఖ్య ఘట్టమైన రథోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలన్నారు. ఈ నెల 6న సోమవారం జరిగే రథోత్సవం రూట్‌లో అడ్డంకులు ఏమైన ఉంటే తొలగించేలా సదరు వ్యక్తులకు నోటీసులు అందించాలన్నారు. దేవస్థానం ట్రస్టీలు, దేవాదాయ ధర్మాదా యశాఖ, పోలీసు, పంచాయతీ అధికారులు, విద్యుత్, టెలికం, కేబుల్ నిర్వాహకులు సమన్వయంతో రథోత్సవానికి అవాంతరాలు తలెత్తకుండా చూడాలని కోరారు. పారిశుధ్య కార్మికులు అందుబాటులో ఉంచి ఎప్పటికప్పుడు పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపిపి డి.లలితకుమారి, దేవాలయ కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు, ట్రస్టీలు కొడాలి పానకాలరావు, కొడాలి శంకరరావు, లక్ష్మీకాంతారావు, స్టేషన్ రైటర్ నాగరాజు, పద్మశాలీయ సంఘీయులు కె. పిచ్చయ్యశాస్త్రి, రామనాథం రామకృష్ణ, బండారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్సీసీ విద్యార్థులు సమాజానికి స్ఫూర్తినివ్వాలి

విశాలాంధ్ర - చీరాల : ఎన్సీసీ విద్యార్థులు క్రమ శిక్షణ, అంకితభావం, దేశ భక్తి, నాయకత్వ లక్షణాలతో సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకొని సమాజానికి స్ఫూర్తిగా నిలవాలని చీరాల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పిరవికుమార్ అన్నారు. ఎన్సీసీ వేడుకలు బుధవారం చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపల్ రవికుమార్ మాట్లాడుతూ ఎన్సీసీ విద్యార్థులు చదువులోనూ రాణించాలని అన్నారు. మరో ముఖ్య అతిథి ప్రభుత్వ వైద్యాధికారిని డాక్టర్ సుబాషిని మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని వాటిని నిలబెట్టలని, సమాజంలో అవినీతి వేళ్ళునుకుపోయిందని దీనినీ అంతమొందించేం దుకు యువత ముందుకు రావాలని అన్నారు. మనం చేసే ప్రతి పనిలో మనదైన ముద్ర ఉండాలనీ, మన చుట్టుపక్కల ఉండే వారితో సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తూ చేసే పనిని వాయిదా వేయకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేస్తే విజయాన్ని సులువుగా దక్కించుకోవచ్చని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా నీటి కొరత వేధిస్తోందని నీటినీ పొదుపుగా ఉపయోగించడంతోపాటు వనరులను సద్వినియోగం చేసుకోవాలని యువత ఈ విషయంలో నాయకత్వం వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సుబేదార్ సంతోష్ కుమార్, హవల్దార్ గాలయ్య మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్సిసి ఉండటం అరుదైన విషయమని అటువంటిది చీరాల ఇంజనీరింగ్ కళాశాలలో ఇంత పెద్ద ఎత్తున విద్యార్థులు ఎన్సిసిలో చేరటం వివిధ కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ పోటీలలో ప్రతిభ చూపిన ఎన్సిసి విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, పతకాలు బహుకరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్వోడీలు డాక్టర్ బషీర, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సౌజన్య, డాక్టర్ శ్రీనివాసరావు, ప్రకాష్ రాజ్,ఏవోఫణి కుమార్,ప్లేస్మెంట్ ఆఫీసర్ బాజీ షాహిద్, ఎన్సిసి ఆఫీసర్ హరీష్, ఎన్సిసి విద్యార్థులు,అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన సీఎం జగనేకే సాధ్యం

- మంత్రి మేరుగ నాగార్జున

విశాలాంధ్ర - బాపట్ల : రాష్ట్రంలో అన్నీ వర్గాలకు సంక్షేమ పాలన అందించటం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖామంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. వేమూరు మండలం బలిజేపల్లి గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటించి వైసీపీ పాలనలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేశారు. అనంతరం మంత్రి మేరగ మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్మోహనరెడ్డి అధికారంలోకి వచ్చాక పింఛన్ మొత్తాన్ని విడతల వారీగా పెంచుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం మాదిరిగా కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు నేరుగా ఇంటి ముంగిటకే వచ్చి చేరుతుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, జడ్పీటీసీ గాజుల హేమలత, ఎంపీపీ ఎల్లమాటి మోహన్ ఎంపీటీసీ కొండూరు నాగరాజుకుమారి, సర్పంచ్ బొజ్జ వెంకయమ్మ, నాయకులు కోగంటి లవ్ కుమార్, గుండాల ప్రతాప్, జల్లి ఏబు,.కంచర్ల సుశీలరావు. బెల్లంకొండ శివ పార్వతి,రావిపూడి శ్రీనివాసరావు, రావిపూడి బుజ్జిబాబు, కస్తూరి సాంబశివరావు, పరిస రామయ్య, కొండిశెట్టి రాంబాబు తదితరులున్నారు.

గృహ సారథులు సమాజ సేవకులు

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గృహ సారథులు సామాజిక సేవకులని రాజ్య సభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు అన్నారు. పట్టణంలోని శ్రీ సీతారాముల కల్యాణ మండపంలో బుధవారం వార్డు కౌన్సిలర్లు, కన్వీనర్లు వాలంటరీలు, గృహ సారథులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజలను ఆర్థికంగా భలోపేతం చెయ్యాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ఈ మూడు సంవత్సరాల పాలనలో రాష్ట్రంలో రూ. 17.50 కోట్లు సంక్షేమ పథకాలకు అందించిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడకూడదని నూతన పాలన విధానాన్ని ప్రవేశపెట్టారని అందులో భాగంగా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రజలకు సత్వర సేవలు ఇంటికి వచ్చి అందించేందుకు వాలంటరీలను నియమించారని తెలిపారు. వాలంటరీ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా ఉందన్నారు.అర్హులైన ప్రతి పేదవారికి పథకాలు అందించాలనే ఆశయం తో గృహ సారథులను నియమించారని చెప్పారు. ఇద్దరు వాలంటరీలకు ఒక గృహ సారథి ఉంటారని వీరు ప్రజల్లోకి వెళ్లి అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. కొందరు గృహ సారథులు ప్రతిపక్ష పార్టీల నాయకులకు దగ్గరగా ఉంటూ రూటు మార్చారనే ఆరోపణలు తమ వద్ద ఉన్నాయని, అలాంటి వారి పై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జగన్మోహన్ రెడ్డి రెండవసారి ముఖ్యమంత్రి కావటమే అంతిమ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మాజీ శాసన సభ్యులు దేవినేని మల్లికార్జునరావు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డైమాండ్ బాబు మున్సిపల్ చైర్పర్సన్ కట్టా మంగా వైస్ చైర్మన్ గుప్త, ప్రశాంత్ పాల్గొన్నారు.

పూజా ద్రవ్యాల విక్రయాలకు వేలంపాట

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండల పరిధిలోని చందోలు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ బగలాముఖి అమ్మవారి దేవస్థానంలో పూజా ద్రవ్యములు అమ్ముకునే హక్కు లైసెన్సుకు దేవస్థానంలో నిర్వహించిన పాటలో 30 మంది పాటదారులు పాల్గొన్నారని దేవదాయ శాఖ ఈఓ. జీ.నరసింహారావు బుధవారం తెలిపారు. ఈ పాటలో 5 మంది హాజరై డిపాజిట్లు చెల్లించే లోగా రూ.2.లక్షల 4 వేలు ఉన్న రేటును రూ.2 లక్షల 10 వేలకు హైయెస్ట్ బిడ్డర్ గా పిన్ను బోయిన పెదవీరయ్య అనువారు పాడుకున్నారని తెలిపారు. మిగిలిన 2 లైసెన్స్ పాటలకు వివిధ కారణాలవల్ల ఈనెల 10వ తేదీకి వాయిదా వేశారని అయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ మోదుగుల ప్రభాకర్ రెడ్డి, సభ్యులు తుమ్మా జోగేశ్వర్ రెడ్డి, ఆనందరావు, వెంకటేశ్వరమ్మ, వెంకటలక్ష్మి, పెనుగొండ బాలకృష్ణమూర్తి దేవస్థానం పూజారి కుంచెల నరసారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో పెరిగిన దాడులు, దౌర్జన్యాలు

విశాలాంధ్ర - కర్లపాలెం : వైసీపీ ప్రభుత్వం పాలనలో రాష్ట్రంలో దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయని టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. మండలంలోని పెదగొల్లపాలెం గ్రామంలో బుధవారం ఇదేమీ ఖర మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేగశన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రశ్నించిన వారిని అధికారం అడ్డుపెట్టుకుని చిత్రహింసలకు గురి చేస్తున్నారన్నారు. పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకొని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తున్నారని రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాల్సిన పోలీసులు అధికార పార్టీ వారు చెప్పినట్టు నడుచుకోవటం సిగ్గుచేటన్నారు. నిబంధనలు పేరుతో సంక్షేమ పథకాలు నిలిపేసి వారిని ఇబ్బందులు పెడుతున్నారని ప్రజలు తెలుపుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమలు రాక, ఉన్న పరిశ్రమలు తరలి పోతున్నాయాయన్నారు. యువతకు ఉపాధి లేక ప్రక్క రాష్ట్రాలకు వలస పోయే పరిస్థితి ఏర్పడిందని రాష్ట్రం మరలా తిరిగి గాడిన పడాలి అంటే తెలుగుదేశం ప్రభుత్వం రావాలని ప్రజలంతా కోరుకొంటున్నారని తెలిపారు. అసలే నిత్యవసర సరకుల ధరలు పెరిగి ప్రజలు అల్లడిపోతుంటే ఈ ప్రభుత్వం పన్నుల పేరుతో వారి మీద ఇంకా పెనుభారం మోపుతున్నారన్నారు. ప్రజలు మా దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడానికి తెలుగుదేశం పార్టీ తరపున పోరాటం చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు అండగా ఉంటా మని నరేంద్ర వర్మ తెలిపారు. టీడీపీ మండలాధ్యక్షులు ఏపూరి భూపతిరావు, పార్లమెంట్ నాయకులు నక్కల వెంకటస్వామి, తదితరులున్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : ఈ నెల13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసేవరకు ఎన్నికల సంఘం నిబంధనల అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం ఎస్పీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ కూడా చట్టాన్ని అతిక్రమించకూడదని, ఎన్నికలకు ముందు రోజు నుంచి బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బందోబస్తు విధులలో పాల్గొనే సిబ్బందికి ప్రత్యేకంగా సూచనలు చేయాలని ఎన్నికలు జరిగే ప్రదేశాలలో పెట్రోలింగ్ నిర్వహించా లన్నారు. మద్యం, బహుమతులు, నగదు పంపకాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలని, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా ప్రజలకు సూచనలు చేస్తూ పెట్రోలింగ్ తిరగాలన్నారు. పోలింగ్ జరిగే పరిధిలోని చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో గతంలో పాల్గొన్న వారిని గుర్తించి ముందస్తు బైండ్‌ఓవర్ చేసి ఎమ్మార్వో ముందు హాజరు పరచాలన్నారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ ప్రాంతాల్లో పోలింగ్ జరిగే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని కేటాయిస్తామని పోలింగ్ జరిగే ఏరియాలో చెక్ పోస్ట్‌లోనే ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు మరింత బాగా పెంచాలని అదే సమయంలో చెక్ పోస్ట్ వద్ద ఏదైనా అక్రమ మద్యం గంజాయి వంటివి తనిఖీ చేయాలన్నారు. పోలింగ్ జరిగే ప్రాంతంలో 100 మీటర్లు దూరం వరకు మార్కింగ్ చేసి 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఎలక్షన్ జరుగుతున్న సమయంలో 100 మీటర్ల లోపు అభ్యర్థులు ఎటువంటి ప్రచారం చేయకుండా చూడాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో పాత నేరచరిత్ర లేని వారికి ఏజెంట్లగా అవకాశం కల్పించేలా సిబ్బందికి సూచనలు చేయాలన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎలక్షన్ జరిగేందుకు కృషి చేయాలన్నారు. చీరాలలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద ప్రత్యేక గార్డు ఏర్పాటు చేసి స్థానిక అధికారులు పర్యవేక్షణ చేస్తూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి. మహేష్, చీరాల బాపట్ల డిఎస్పిలు పి.శ్రీకాంత్, ఏ.శ్రీనివాసరావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ బాల మురళీకృష్ణ, అడ్మిన్ తదితరులున్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- దళిత బహుజన ప్రజా పార్టీలు, సంఘాలు డిమాండ్

విశాలాంధ్ర - బాపట్ల : దళితుడైన గొల్ల వరప్రసాద్ యొక్క భూమిని కబ్జా చేస్తూ తుపాకితో చంపుతామని బెదిరించి, కులం పేరుతో దూషించింన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజును, తన అనుచరులైన బీజేపీ రాష్ట్ర మీడియా కన్వీనర్ లక్ష్మీపతి రాజు, వల్లభనేని సుధాకర్ చౌదరి, బద్రిరెడ్డి వెంకట రెడ్డిలపై ఎస్సి ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని దళిత బహుజన పార్టీలు, సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం బాపట్ల పట్టణంలోని విసికే పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంగళగిరి మండలం చినకాకాని పంచాయితీ పరిధిలో దళిత సామాజిక వర్గానికి చెందిన గొల్ల వర ప్రసాద్‌కు చెందిన ఆరు ఎకరాల భూమిని కేంద్రంలో అధికారంలో ఉన్నామన్న అహంతో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు,తన అనుచరులు లక్ష్మీపతిరాజు,సుధాకర్ చౌదరి, బద్రిరెడ్డి వెంకట రెడ్డిలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ భూముల ప్రయివేటీకరణ పేరుతో అన్ని ఆధారాలు ఉన్న దళితుల భూములను అక్రమించు కుంటున్నారని మండిపడ్డారు. అందులోభాగంగానే దళితుడైన వరప్రసాద్ భూమిని కూడా అక్రమించుకోవాలని చూశారని అన్నారు. రాష్ట్రంలో ఉన్న దళిత బహుజనులు అంత అమాయకులు కాదని న్యాయ స్థానాలపై తమకు నమ్మకం ఉందని, పద్దతి మార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు తాము వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విసికే పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు రేగులగడ్డ చంద్రశేఖర్, బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు కొచ్చెర వినయ్ రాజు, కెవిపియస్ రాష్ట్ర కమిటీ సభ్యులు శరత్,మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్ బాబు,విసికే పార్టీ బాపట్ల మహిళా అధ్యక్షురాలు దాసరి లక్ష్మీ,ఉప్పాల వెంకటేశ్వర్లు, ఆనంద్, భరత్, వికాస్,మధు పాల్గొన్నారు.

పేదలపై స్వారీ కాదు సేవ చేయాలి

- చేప్పేది ఒకటి చేసేది మారొకటి
- మోడీ పాలనలో పెరిగిన గ్యాస్ ధరలు
- అల్లాడుతున్న ప్రజలు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : పేదలకు "సేవ" చేస్తామని అధికారంలోకి వచ్చిన పాలకులు పేదల జీవితాలపై "స్వారీ" చేస్తున్నారు. కట్టెల పొయ్యి మీద వంట చేస్తూ కష్టాలు పడుతున్న ఆడపడుచుల కన్నీరు తుడిచి పొగరహిత సమాజాన్ని నిర్మించేందుకు దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్ లను పంపిణీ చేసి ధరలను పెంచుతూ పాలకులు వినియోగదారులను ఆర్థికంగా దోపిడి చేస్తోంది. ఇప్పటికె పెరిగిన ధరలతో అల్లాడుతున్న ప్రజానీకంపై మోడీ సర్కార్ మరోసారి గ్యాస్ ధరలను పెంచి నడ్డివిరిచింది. తాము అధికారంలోకి వస్తే అధిక ధరలను అరికడతామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన మోడీ పాలనల్లో వంట గ్యాస్ ధరలు పెంచడం చూస్తుంటే ఈ పాలకులు చెప్పేది ఒకటి చేసేది మరోకటి అన్నది స్పష్టమౌతుంది. ఒక వైపు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు మరోవైపు చుక్కలను చూపుతున్న కూరగాయల ధరల పెరు గుదలతో ఆర్థిక పరమైన ఇబ్బదులతో సతమతమవుతున్న ప్రజానీకంపై కేంద్ర ప్రభుత్వం నేడు వంట గ్యాస్ ధరను పెంచి ప్రజలపై భారాన్ని మోపడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదరికం నిర్మూలనే మా ధ్యేయం. బలహీన వర్గాల సంక్షేమమే మా లక్ష్యం. అంటూ వేదికలపై ఉపన్యాసాలు చేస్తూనే పేదలపై పెనుభారాలను మోపుతూ కార్పోరేట్ సంస్థలకు పాలకులు ఊడిగం చేస్తున్నారంటూ పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధి కారంలోకి వచ్చిన తరవాత ప్రజా సంక్షేమాన్ని విస్మరించి భారాలను మోపడమే పనిగా సబ్సిడీలను రద్దు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్ అందించారు.. కట్టెల పొయ్యి పోయింది. గ్యాస్ ధర భారంగా మారింది. గ్యాస్ సిలెండర్ కొనాలంటే చుక్కలు కనిపి స్తున్నాయి. గ్యాస్‌ను ధరలను పెచుతూ పేదల వద్దనుంచి డబ్బు గుంజుతుందంటున్నారు. 2014 మార్చిలో 14.2 కిలోల గ్యాస్ ధర రూ. 410లు ఉన్న గ్యాస్ సిలెండర్ ధర నేడు రూ. 1150లకు పెంచేశారు. పస్తుతం కేంద్ర ప్రభుత్వం 14.2 కిలోల గృహ వినియోగ గ్యాస్ సిలెండర్‌కు బుధవారం కేంద్ర ప్రభుత్వం రూ. 50లు ధర పెంచడంతో సిలెండర్ ధర రూ. 1150లకు చేరింది. పేదల సంక్షేమం కోసం కట్టుబడి ఉన్నామని చెప్తూనే సంక్షేమ పథకాలను రద్దుచేస్తూ పెద్దోళ్ళకు దోచి పెడుతుదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం ఒకే పన్ను అన్న నినాదంతో అమలులోకి తీసుకు వచ్చిన వస్తు సేవల పన్ను (జిఎస్టి) ని అమలులోకి తీసుకు వచ్చి కార్పోరేట్ శక్తుల గళ్ల నిండుతుంది. గ్యాస్, పెట్రోలు, డిజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి పరిదిలోకి ఎందుకు తీసుకురావడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాల కారణంగా పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల జీవనం దుర్భరంగా మారుతుంది. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న విదానాలపై ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధమైనప్పుడే వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మార్గ ఏర్పడుతునందున్న ఆశగా పోరుబాట సాగిస్తారని ఆశిందాం...